క్లుప్తంగా

మణిపూర్‌లో శాంతి నెలకొనేలా చూడాలి

కడప కల్చరల్ : మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులను అదుపులోకి తెచ్చి అక్కడ శాంతియుత వాతావరణం నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కోరారు. ఆదివారం చర్చిలో మణిపూర్‌లో శాంతి నెలకొనాలని క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు రవితేజ, శాంతిరాజు, నరసయ్య, అగస్టీన్, సరళ, లక్ష్మి, రోజా లీలావతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డి సర్కిల్ : నగరంలోని పలు కూడళ్లలో ఆదివారం అనాథలు, అభాగ్యులకు అమృతవల్లి ఫ్యాన్సీస్టోర్ అధినేత ప్రకాశ్ ఆహారం పంపిణీ చేశారు.

ఆర్థికసాయం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థినికి బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థికసాయం అందజేసింది. జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పావని ఆర్థిక సమస్యల వల్ల చదువు కుంటుపడే ప్రమాదం ఏర్పడింది. దీంతో బాసట సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరువ బాలాజీరావు, సంస్థ కీలక సభ్యులు డీపీ కార్తీక్‌రెడ్డి, మిత్రుల సహకారంతో ఆదివారం విద్యార్థిని పావనికి రూ. 15 వేలు చెక్కు రూపంలో అందజేశారు.

విరాళం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా రూ.10వేల విరాళం ఇచ్చారు. ఆదివారం ఆయన తన పుట్టిన రోజు సందర్భంగా రక్షణ సంస్థ అధ్యక్షుడు సంపత్‌కుమార్, మహిళా నాయకురాలు చైతన్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చాక్లెట్ గౌస్, సీహెచ్ సునీల్, షబ్బీర్, తులశమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఇన్సూరెన్స్ ఆవశ్యకతపై సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఆటో రిక్షా యజమానులకు ఇన్సూరెన్స్ యావశ్యకత, ఫేక్ ఇన్సూరెన్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపరవాణాశాఖ కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సుకు ఆటో రిక్షా యజమానులతో పాటుయూనియన్ నాయకులు హాజరు కావాలని కోరారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం స్థానిక చిన్నారుల ఆట–పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై స్థానిక చిన్నారి కళాకారులు విశేష ప్రాచుర్యం పొందిన సినీ గీతాలు, జానపద గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. సందర్శకులు కరతాళ ధ్వనులతో వారిని ప్రోత్సహించారు. శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

కడప ఎడ్యుకేషన్ : కడప నాగరాజుపేటలోని మెడికేర్ ఆసుపత్రి వైద్యుడు మహబూబ్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 200 మంది రోగులకు షుగర్, కొలెస్ట్రాల్ తోపాటు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మెడికల్ రెప్స్, ఆసుపత్రి సిబ్బంది సుబ్బరాయుడు, నూర్, గౌతమి, ఆయేషా, యాస్మిన్, అంజనా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవధూత నారాయణస్వామి ఆరాధన

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో ఆదివారం అవధూత నారాయణస్వామి 23వ ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నారాయణ స్వామి సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బ్రాహ్మణపల్లె భక్త భజన బృందంచే చెక్కభజన, కోలాటం కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

మొక్కజొన్న.. లాభాలెన్నో!

ఆరోగ్య ప్రయోజనాలు అధికం
కొనుగోలుకు మొగ్గుచూపుతున్న ప్రజలు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుతం మొక్కజొన్న కంకులు సీజన్ ప్రారంభమైంది. వర్షాకాలంలో వేడివేడిగా కాల్చిన మొక్కజొన్న కంకులు తినేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. దీంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరుగుతోంది. అయితే ఇందులో అధిక మొత్తంలో ఉన్న ప్రొటీన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. మొక్కజొన్నలో పీచు పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. ఆహారంలో పీచు ఉంటే మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్‌ను అరికడుతుంది. మొక్కజొన్నలో మ్యాగ్నిషియం, ఐరన్, కాపర్, పాస్పరస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇది ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. అంతేకాకుండా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు సహకరిస్తాయి. మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతాయి. ఈ గింజల నుంచి తీసిన నూనెలో లీనో లేయాసిడ్ ఉంటుంది. ఇది చర్మంపై మంటలను, ర్యాసెష్‌ను తగ్గిస్తుంది. ఐరన్, పోలిక్‌యాసిడ్, రక్తహీనత నుంచి కాపాడుతుంది. అంతేకాకుండా కొలన్ కేన్సర్ నివారణకు, డయాబెటీస్ నివారణకు మొక్కజొన్న ఎంతో మేలు చేస్తుంది.

మొక్కజొన్నలో పోషకాలు



మొక్కజొన్నలో ఎన్నో పోషక విలువలున్నా యి. ఈ సీజన్‌లో లభించే మొక్కజొన్న ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటుంది. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, కొన్ని రకాల పోషకాలు పుష్క లంగా అందుతాయి. రక్తహీనతను తగ్గించడంతోపాటు జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, మూత్రపిండాల పనితీరును వృద్ధి చేసేందుకు దోహద పడుతుంది. మొక్కజొన్న తీసుకోవడం మంచిది.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య నిపుణులు, కడప

కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్షాల అనుబంధ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రభుత్వంతో గత 16 నెలల్లో 25 సార్లు చర్చలు జరిపినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1న జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం సమర్పించడం, 2న జిల్లా కేంద్రాల వద్ద ధర్నాలు, 7న తిరుపతిలోని ప్రధాన కార్యాలయం వద్ద జరిగే ఆందోళన కార్యక్రమానికి కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష అనుబంధ సంఘాల నాయకులు ఓబులేసు, అవదానం శ్రీనివాస్, గంగయ్య, రాజామణి, నాగ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శిగా ముజీబ్

కడప కార్పొరేషన్: సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ కౌన్సిల్ నగర ప్రధాన కార్యదర్శిగా షేక్ ముజీబ్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర అధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా నియామకపత్రం, గుర్తింపు కార్డు అందజేశారు.కార్యక్రమంలో ఎజాస్, దావూద్, కిషోర్, షాజహాన్, రఫీ, ఆరీఫ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడుగురు జూదరులను ఆదివారం ఎస్‌ఐ జయరాముడు సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 9.880 నగదుతో పాటు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిద్దాం



మాట్లాడుతున్న బాల బయ్యన్న

కడప కల్చరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగాలకు తొలి ప్రాధాన్యతనిద్దామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బాల బయ్యన్న అన్నారు. ఆదివారం నగర మహాసభను నగర అధ్యక్షుడు అబ్బాస్ అలీ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బయ్యన్న మాట్లాడుతూ ప్రజల్లో అజ్ఞానం ఇంకా తొలగిపోలేదని, దాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైన్స్ ఫలితాలను అందజేయాల్సిన బాధ్యత జన విజ్ఞాన వేదికపై ఉందన్నారు. సంస్థ నగర కార్యదర్శి వసంత్, ప్రతినిధులు కామేశ్వరమ్మ, షామీర్‌బాష, వెంకట్రామరాజు, శివరాం, ప్రకాశ్, కరీముల్లా, మధుసూదన్, సత్యనారాయణ, రాహుల్, జానకిరాం పాల్గొన్నారు.

పురంధేశ్వరి విభజన హామీలపై మాట్లాడాలి

పులివెందుల రూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి విభజన హామీలపై మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ కోరారు. ఆదివారం ఆయన దూదేకుల సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంను విమర్శించే నైతిక విలువలు పురందేశ్వరికి లేవన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి 25 రకాల హామీలు ఇచ్చారన్నారు. ఇందులో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత, విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్, రాయలసీమ ఉత్తరాంధ్ర వెనుబడిన జిల్లాల అభివృద్ధికి, ప్రత్యేక ప్యాకేజీ మరికొని ఉన్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్న ఇంతవరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మీద పురందేశ్వరికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే విభజన అంశాలపై పోరాడితే ప్రజలు హర్షిస్తారన్నారు.

పాలకొండ్రాయుడి క్షేత్రంలో స్వచ్ఛభారత్



ఆలయం వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న ప్రణవపీఠం సభ్యులు

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాలకొండల్లో ఆదివారం 15 మంది స్వచ్ఛంద సేవకులు ఆ పరిసరాలను శుభ్రపరిచారు. ఏలూరు ప్రణవపీఠం ప్రతినిధి గిరిధర్ ఆధ్వర్యంలో సభ్యులైన యువకులు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి భక్తులు ప్రదక్షిణ చేసే మార్గాన్ని శుభ్రపరిచారు. అనంతరం వినాయకస్వామి వద్ద కోనేరులోని ప్లాస్టిక్ వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించి నీటిని శుభ్రపరిచారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పద్మజ, సుబ్రమణ్యం, పరమేశ్వర రెడ్డి, వెంకటసాయి, వెంకటేశ్వర్లునాయుడు, శ్రీను, సుబ్రమణ్యంశాస్త్రి, రాజేష్, రవీంద్రబాబు, యశ్వంత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టువస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చనిచెట్ల మధ్య భక్తులు బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలీసుశాఖ ఖాళీ స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్: కడప పోలీసు లైన్‌లో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకు వద్ద ఖాళీగా ఉన్న పోలీసుశాఖకు చెందిన 30 సెంట్ల స్థలంలో నెలసరి అద్దె ప్రాతిపదికన వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన వాటిని నిర్వహించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ అధికారులు తెలిపారు. చేయబోయే వ్యాపార వివరాలతో స్కెచ్, డ్రాయింగ్‌ల బ్లూప్రింట్ నకలు, కాపీలను దరఖాస్తుకు జత చేసి ఆగస్టు 2న సాయంత్రం 5గంటలలోపు ఆర్.ఐ (వెల్ఫేర్), జిల్లా పోలీసు కార్యాలయం, కడప ఆఫీసులో సమర్పించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన తరువాత వేలం నిర్వహణకు తేదీని ఎంపిక చేసి దరఖాస్తుదారులకు తెలియజేస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు ఆర్ఎస్‌ఐ కె. రామస్వామిరాజు 94409 41424 నంబరులో సంప్రదించాలని కోరారు.

2న వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం సమావేశం

కడప కల్చరల్: డాక్టర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రత్యేక సమావేశాన్ని ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు ఫోరం రాయలసీమ విభాగం కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. కడప నగరం మానస ఇన్ హోటల్‌లో బుధవారం ఉదయం 10.00 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందులో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై మేధావులు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శాంతమూర్తి అధ్యక్షత వహిస్తారని చెప్పారు. నగరంలోని మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాబు హయాంలో సీమకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు రాయలసీమకు ప్రతిసారీ అన్యాయమే చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులను మొదలు పెట్టి 80 శాతం పనులు పూర్తి చేశారన్నారు. రాయలసీమకు గుండెకాయలాంటి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల క్యూసెక్కులకు పెంచారన్నారు. ఆ పెంపు వల్లే నేడు రాయలసీమలోని ప్రాజెక్టులకు నీరు వస్తోందన్నారు. అప్పట్లో దీన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు కోస్తా నేతలతో ప్రకాశం బ్యారేజీపై ధర్నా చేయించారని గుర్తు చేశారు. వైఎస్సార్ తర్వాత అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ప్రాజెక్టుల పనులు తిరిగి మొదలయ్యాయన్నారు. గతంలో ఉన్నదూ లేనివిధంగా గండికోటలో 26 టీఎంసీలు, బ్రహ్మంసాగర్‌లో 16 టీఎంసీలు నిల్వ చేశారంటే అందుకు కారణం ముఖ్యమంత్రి చిత్తశుద్ధేనని అన్నారు. ఎన్నికలు రాబోతున్నాయనే చంద్రబాబు రాయలసీమ జపం చేస్తున్నారన్నారు. సీమలో పుట్టినప్పటికీ బాబు ఈ ప్రాంతానికి ఒక్క మేలు కూడా చేయలేదని, ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ ఆయన్ను నమ్మబోరని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ కరీం జిలానీ, ఫవాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రాయలసీమ రైతు ద్రోహి చంద్రబాబు



సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : గాలేరు నగరి సుజల స్రవంతి పథకం(జీఎన్ఎస్ఎస్) గ్రావిటీ ద్వారా రాయలసీమకు నీళ్లు రావడం సాధ్యంకాదని శ్రీకృష్ణస్వామి కమిటీ వేసి జీఎన్ఎస్ఎస్ పథకాన్ని పక్కన పెట్టిన రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన కడపలో మాట్లాడుతూ చంద్రబాబు 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి రాయలసీమ రైతులకు ఒరగపెట్టింది ఏమీ లేదన్నారు. అలాంటి వ్యక్తి ఆగస్టు 2వ తేదీన గండికోట ప్రాజెక్టు సందర్శన కోసం రావడం విడ్డూరమని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే జీఎన్ఎస్ఎస్ పథకాన్ని మొదలు పెట్టి 85 శాతం మేర పనులను పూర్తి చేశారన్నారు. 11200 క్యూసెక్కుల కెపాసిటీ ఉన్న పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును 44000 వేల క్యూసెక్కులకు పెంచినప్పుడు చంద్రబాబు కోస్తా నాయకులతో ధర్నా చేయించారన్నారు. ఇలాంటి ప్రాజెక్టు వ్యతిరేక ద్రోహి ఏ ముఖం పెట్టుకుని గండికోట ప్రాజెక్టును సందర్శిస్తారని విమర్శించారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి



మాట్లాడుతున్న పోగుల వెంకట్రామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అదించాలని విభాగ్ సహ ప్రచార ప్రముఖ్ సంజీవరెడ్డి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆపస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్వర్యంలో ఉపాధ్యాయులకు అభ్యాస వర్గ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆపస్ కార్యకర్తలు నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తూ పిల్లలో నైతిక విలువలను పెంపొందించి దేశభక్తి నిర్మాణం చేయాలన్నారు. జిల్లా పర్యాటన కార్యకర్తగా వచ్చిన రాష్ట్ర సహ కోశాధికారి కృష్ణార్జునరెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీడీఏ బకాయిల విషయంలో అధికారులతో, ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు రామోహన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు, ఎరుకలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణుడు, పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించండి



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగర శివార్లలోని టెలికాం నగర్‌లో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలలో ఆర్ఎస్‌వైఎఫ్ సభ్యులు విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 57 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఇక్కడ టీచర్ల కొరత ఉందని, మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ నగర నాయకులు తరుణ్, షాబాద్, సుమద్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న మల్లికార్జున

కడప సెవెన్‌రోడ్స్ : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కోరారు. ఆదివారం కడప ఆటోనగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రుషింగప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్ర రుణాలు సకాలంలో అందజేయాలన్నారు. ఎన్‌హెచ్‌డీసీ ద్వారా నూలు, పట్టు రాయితీ ఇవ్వాలని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తూ జారీ చేసిన జీఓను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు రామదాసు, నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథా



పైపులైన్ లీకేజీతో రోడ్డుపై నిలిచిన తాగునీరు

కడప కార్పొరేషన్: కడప నగరం చిన్నచౌకు మద్రాసు రోడ్డులో సుజుకీ షోరూం ఎదుట తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోంది. సుజుకీ షోరూం నుంచి పెట్రోల్ బంకుల మీదుగా ప్రవహించి సుశాంత్ మోటర్స్‌కు వెళ్లే దారిలో నీరు నిలుస్తోంది. సుమారు వారం రోజులకుపైగా నీరు వృథాగా ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. నీరు రోడ్డుపైకి చేరడంతో వాహనదారులకు కూడా ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మానవత సేవలు విస్తృతం చేయాలి



యశోదను సత్కరిస్తున్న మానవత బృందం

వేంపల్లె : సమాజంలోని అభాగ్యులకు అండగా నిలుస్తూ మానవత సేవలు అందించేలా విస్తృతం చేయాలని మానవత వేంపల్లె మండల శాఖ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఆసంస్థ సహాయ చైర్మన్ కావలికృష్ణతేజ, నూతన కార్యవర్గం సభ్యులచే మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కీర్తి పతాక అవార్డు గ్రహీత భవిత దివ్యాంగుల కేంద్రం ఐఈఆర్‌టీ కోటపాటి యశోదను సత్కరించారు. అనంతరం మానవత సేవల ప్రణాళికను తయారు చేసుకుని ఆచరణకు శ్రీకారం చుట్టాలని చక్రపాణిరెడ్డి కోరారు.

మానవత సంస్థ బృందం ఆదివారం ఫారెస్ట్ బీట్ అధికారి మధుతో కలసి ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని సందర్శించి వాటికి అవసరమైన దానాను అందజేశారు. ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జ్యోతి తల్లిదండ్రులు చనిపోవడంతో సంస్థ ద్వారా ఆమెకు చేయూత నిస్తామని ఆసంస్థ సభ్యులు హామీ ఇచ్చారు. సంస్థ ఉపాధ్యక్షుడు ముత్యాలయ్య, కార్యదర్శి మను(లైన్‌మెన్), డైరెక్టర్లు రంగారెడ్డి, డాక్టర్ రంగయ్య, రాజారాం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు తోడుగా జగనన్న ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేతలు

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పాలనలో చేనేతలకు ఎంతో ప్రాముఖ్యత కలిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని రామనపల్లెలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు ఆధ్వర్యంలో నేతన్నలు ముఖ్యమంత్రికి దన్యవాదాలు తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నేతన్నల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం అనే కార్యక్రమాన్ని చేపట్టి ఎవరైతే మగ్గాలపై జీవనం సాగిస్తున్నారో అలాంటివారికి సంవత్సరానికి రూ.24 వేలు అందిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేనేత రంగానికి ఎంతో ప్రోత్సాహం ఇవ్వడం జరిగిందన్నారు. అప్పట్లో జిల్లా వాసి అయిన బండి హనుమంతును ఆప్కో చైర్మన్‌గా నియమించడంతోపాటు ఆయనకు ఎమ్మెల్యే టికెట్ కూడా ఇచ్చి ప్రోత్సహించారన్నారు. జగనన్న రామనపల్లి గ్రామానికి ఆ వర్గంలో డైరెక్టర్‌గా ఇవ్వడంతోపాటు 102 మందికి నేతన్న నేస్తం ఇచ్చారన్నారు. ఇప్పటికే గ్రామ అభివృద్ధికి నాలుగున్నర కోటి ఖర్చు చేశామన్నారు. అలాగే రూ.27 కోట్లతో కడప బైపాస్ నుంచి ఓబులంపల్లి వరకు రోడ్డు పనులు, రాచినాయపల్లె నుంచి రామనపల్లె వరకు రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే అక్కడక్కడ చిన్న చిన్న బ్రిడ్జీలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం నేతన్నల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ టౌన్ ఇన్‌చార్జి ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మడక వెంకటసుబ్బయ్య, దేవగుడి భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, బాలకొండారెడ్డి, పుత్త మోహన్‌రెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు, చేనేత కార్మికులు వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.